# ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తాం

- అధికారులు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి
- 6 గ్యారెంటీల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయాలి
- జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశానికి హాజరైన అధికారులు

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్18(నమస్తే తెలంగాణ) : మంత్రిగా తొలిసారిగా కలెక్టరేట్‌కు వచ్చిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, కలెక్టర్ ఆర్.వీ.కర్ణన్, వివిధ శాఖల అధికారులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం మిషన్ భగీరథ, విద్యుత్, పౌరసరఫరాలు, తదితరల శాఖలపై అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా అధికారులంతా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఎన్నికల హామీలో భాగంగా ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీన్ని అమలులో అధికారులదే కీలకపాత్ర అని చెప్పారు. అధికారులకు కూడా తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రజలందరికీ సురక్షిత తాగునీరు అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలకు చాలా నమ్మకం ఉందని, వారి ఆశలని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మిషన్ భగీరథ నీళ్ల సరఫరాపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులదేనని స్పష్టం చేశారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలతో అధికారులు సమావేశాలు నిర్వహించి తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. ఇక విద్యుత్ సమస్యలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. కరెంటు సమస్యలపై రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించాలన్నారు. దీనిపై పూర్తి స్థాయి నివేదిక అందజేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. సబ్ స్టేషన్ల ఏర్పాటు, విస్తరణ కోసం పిలిచిన టెండర్ల పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతుందని అధికారులను వివరణ కోరారు. విద్యుదాఘాతంతో మరణించిన 32 మందికి పరిహారం చెల్లింపులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ సమస్యలు తీర్చేందుకు కావాల్సిన నిధుల వివరాలు ఇస్తే సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి మంజూరీ చేయిస్తానని చెప్పారు. పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రజలకు సరైన సేవలు అందేలా చూడాలన్నారు. పేదల సమస్యలకు పరిష్కారం చూపేలా అన్ని చర్యలు చేపట్టాలని, రేషన్ డీలర్ల పోస్టులు ఖాళీగా ఉండకూడదని చెప్పారు. అందరం కలిసి సమష్టిగా జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కుందూరు జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ ఆర్.వీ.కర్ణన్, అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత్ కేశవ్, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నల్లగొండ అభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ సమావేశంలో చైర్మన్ మందడి సైదిరెడ్డి
- రూ. 55 కోట్ల అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు




మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మందడి సైదిరెడ్డి

నీలగిరి, డిసెంబర్ 18 : నల్లగొండ పట్టణ అభివృద్ధికి ప్రతిపక్షాలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ పట్టణాన్ని కేసీఆర్ దత్తతతో రూ.1,350 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వాటన్నింటినీ పూర్తి చేస్తామని అన్నారు. వార్డుల్లో అభివృద్ధి పనులకు రూ.55 కోట్లు మంజూరయ్యాయని వాటికి టెండర్లు పిలిచే లోపే ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయాయని పేర్కొన్నారు. త్వరలో టెండర్లు నిర్వహించి ప్రతి వార్డుకు రూ. కోటి తగ్గకుండా నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మాట్లాడుతూ పట్టణంలో క్లోరిన్ గ్యాస్ అయిపోయిప్పటికి అధికారులు పట్టించు కోక పోవడం దారుణం అన్నారు. వెంటనే వాటిని తెప్పించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. ఈసీఎల్ బకాయిలు వెంటనే చెల్లించాలని లేకుంటే విద్యుత్ సమస్య వస్తుందని సభ దృష్టికి తీసుకరాగా చైర్మన్ సానుకూలంగా స్పందించి వాటిని చెల్లించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

అనంతరం పలు సమస్యలపై సభ్యులు అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. సమావేశంలో కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్, బీఆర్ఎస్, బీజేపీ ఫ్లోర్ లీడర్లు అభిమన్యు శ్రీనివాస్, బండారుప్రసాద్, కౌన్సిలర్లు గోగుల శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్, పున్న గణేశ్, అలకుంట్ల రాజేశ్వరీ మోహన్‌బాబు, ఊట్కూరి వెంకట్‌రెడ్డి, యామ కవితారాణీ దయాకర్ పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డికి ఘన స్వాగతం

నీలగిరి : రాష్ట్ర ఆర్‌అండ్ బీ, సినిమాటోగ్రఫీ మంత్రిగా బాధ్యతలు చేపట్టి జిల్లాకు తొలిసారిగా వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సోమవారం కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికాయి. ముందుగా మర్రిగూడ ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ర్యాలీగా నల్లగొండలోని ప్రధాన వీధుల గుండా క్యాంపు కార్యాలయం వరకు సాగింది. ఐటీ టవర్ వద్ద, వీటి కాలనీలో ఆయనకు హెలికాప్టర్ ద్వార పూల వర్షం కురిపించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. నల్లగొండలో ప్రతి రోడ్డును అద్భుతంగా తీర్చిదిద్దుతానని అన్నారు. నల్లగొండ ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్, తిప్పర్తి, నల్లగొండ జడ్పీటీసీలు పాశం రాంరెడ్డి, వంగూరి లక్ష్మయ్య, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### జనవరిలో ఫ్లైఓవర్ పనులకు శంకుస్థాపన

చిట్యాల : చిట్యాల పట్టణంలోని జాతీయ రహదారిపై రూ.65 కోట్లతో నిర్మించనున్న ఫ్లై ఓవర్ నిర్మాణానికి సంక్రాంతి పండుగకు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మంత్రి ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలిసారి నల్లగొండకు వెళ్తుండగా చిట్యాలలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి వెంకట్‌రెడ్డి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ జనవరి 2న టెండర్లు ఖరారు అవుతాయని తెలిపారు. అలాగే ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉండి పలు ప్ర మాదాలకు కారణమవుతున్న చిట్యాల–భువ నగిరి రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా దాదాపు రూ. 400 కోట్లతో విస్తరించే పనికి కూడ జన వరిలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, పట్టణ పార్టీల అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీనర్సింహ, జడల చిన మల్లయ్య, పోకల దేవదాసు, కాటం వెంకటేశం పాల్గొన్నారు.

### నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హైదరాబాద్ నుంచి నల్లగొండకు వెళ్తూ మార్గమధ్యలో సోమవారం నార్కట్‌పల్లిలో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో గజమాలతో సన్మానించి స్వాగతం పలికారు. మునుగోడు రోడ్డు నుంచి నల్లగొండ బైపాస్ వరకు బైక్ ర్యాలీతో పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

- ఉపాధి హామీ ఏపీడీ నవీన్‌కుమార్



ప్రజా వేదికలో వివరాలు తెలుసుకుంటున్న నవీన్‌కుమార్

శాలిగౌరారం, డిసెంబర్ 18: ఉపాధి హామీ పనుల విషయంలో సంబంధిత అధికారులు, సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అడిషనల్ పీడీ నవీన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఉపాధి హామీ పనులపై 13వ విడుత సామాజిక తనఖీపై ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 1-12-2021నుంచి 31-03-2023వరకు చేపట్టిన అభివృద్ధి పనులను ఇటీవల సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి వివరాలను సేకరించింది. సమాచారాన్ని సమావేశంలో చదివి వినిపించారు. ఈసందర్భంగా అడిషనల్ పీడీ ఒక్కో గ్రామం వారీగా ఆరా తీసి సంబంధిత సిబ్బంది నుంచి సరైన సమాధానాలను రాబట్టారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కల్లో కనీసం 85శాతం వరకు మొక్కలు బతికేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. సమావేశంలో అంబున్స్‌మెన్ మహమ్మద్ గోరి, విజిలెన్స్ అసిస్టెంట్ మేనేజర్ గౌతమి, ఎస్ఆర్పీ రాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుందరయ్య, ఎంపీఓ సుధాకర్, ఏపీఓ జంగమ్మ, ఈసీ వెంకటాచారి పాల్గొన్నారు.

## కొత్త పనులకు ఎస్టిమేషన్ జనరేట్ చేయాలి : ఏపీఓ రమణయ్య

నకిరేకల్, డిసెంబర్ 18 : ప్రతి గ్రామపంచాయతీలో 50 మంది కూలీలకు తక్కువ కాకుండా ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని ఏపీఓ రమణయ్య సోమవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ప్లానింగ్‌లో భాగంగా గ్రామాల్లో కొత్త పనులకు ఎస్టిమేషన్ జనరేట్ చేయాలని సూచించారు. నర్సరీల్లో బ్యాక్ ఫీలింగ్ ఈ వారంలో పూర్తిచేయాలని, సీట్ డిబ్లింగ్ కూడా పూర్తిచేయాలని ఆదేశించారు.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

## కాలనీల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలి

- మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు

నీలగిరి, డిసెంబర్ 18. నల్లగొండ పట్టణంలోని కాలనీల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కందు కూరి వెంకటేశ్వర్లు శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్, కలెక్టరేట్, మర్రిగూడ జంక్షన్, డీఈఓ కార్యాలయం, ఎన్‌జీ కళాశాల ప్రాంతాల్లో సోమవారం ఆయన పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణవాసులు కూడా రోడ్డు మీద వేయకుండా చెత్త వాహనాలకు అందించేలా వారిని చైతన్యం చేయాలన్నారు. పారిశుధ్య సమస్యలు వస్తే ఏమాత్రం సహించేది లేదని తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కస్తూర్బా విద్యార్థిని ప్రతిభ

కట్టంగూర్, డిసెంబర్ 18 : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థిని ఎల్.అమని జాతీయ స్థాయి కరాటే పోటీలో తృతీయ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్ పొందింది. ఢిల్లీలో జరిగిన అండర్-14 బాలికల కుమిటి ఫైట్ విభాగంలో పాల్గొని జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి తృతీయ స్థానంలో బ్రాంజ్ మెడల్ సాధించిందని పాఠశాల ఎస్ఓ నీలాంబరి, కరాటే మాస్టర్ అంతటి సోములుగౌడ్ తెలిపారు. జపాన్ కరాటే అసోసియేషన్ జిల్లా శాఖ, పాఠశాల ఉపాధ్యాయ బృందం అమనిని అభినందించారు.




అమనికి మెడల్ ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

## జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మహేశ్

రామగిరి, డిసెంబర్ 18: మహాత్మాగాంధీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ పోటీల్లో నల్లగొండలోని సిద్ధార్థ డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థి మారుపాక మహేశ్ ఉత్తమ ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం మహేశ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అకాడమిక్ డైరెక్టర్ గుండెబోయిన జానయ్యయాదవ్ అభినందించారు.అనంతరం వారు మాట్లాడుతూ కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో మహేశ్ ప్రతిభ చూపి కళాశాలతో పాటు వర్సిటీ ఖ్యాతి చాటాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సహచార విద్యార్థులున్నారు.



మహేశ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

## రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా కిశోర్ యాదవ్



శాలిగౌరారం, డిసెంబర్ 18 :మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన నూక కిశోర్ యాదవ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎంపికయ్యారు. కిశోర్ యాదవ్ డిగ్రీ నకిరేకల్‌లో, హైదరాబాద్‌లోని టీకేఆర్ కళాశాలలో ఎంబీఏ విద్య, మహాత్మాగాంధీ యూనివర్సిటీలో లా విద్యను పూర్తి చేసినట్లు తెలిపారు. అనంతరం ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ ప్రవేశ పరీక్ష రాసి బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలకు న్యాయ వ్యవస్థలపై సరైన అవగాహన లేక చిన్న తప్పిదాల వల్ల అన్యాయాలకు గురవుతున్నారని అలాంటి వారికి న్యాయం అందించడమే తన కర్తవ్యమని పేర్కొన్నారు. తన ఉన్నతికి తోడ్పాటునందించిన తన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

**పత్రిక ప్రకటన**

ఇందుమూలముగా నా యొక్క క్లయింట్ అయిన శ్రీ కందుల రాంబాబు, తండ్రి: కందుల ప్రసాద్ (లేటు), వ:37. నివాసం: ఇంటి నెం.12-86/4/1, శ్రీనివాస నగర్, కోదాడ టౌన్ & మండలం, సూరాపేట జిల్లా, తెలంగాణ వారి సూచనలు మేరకు సమస్త ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా,
నా యొక్క క్లయింటుకు సూరాపేట జిల్లా, కోదాడ మున్సిపాలిటి మరియు కోదాడ రెవిన్యూలో చేరిన వార్డ్ నెం.12, సర్వే నెం.1052 మిం.లె. ప్లాట్ నెం. 2, 3 దఖలా చగ 200.00లు ఖాళీ స్థలం ఆయన తండ్రి గారి కందుల ప్రసాద్ పేరుతో కోదాడ సబ్-రిజిస్టారు కార్యాలయం నందు రిజిస్ట్రి కాబడిన విక్రయ దస్తావేజు నెం.2064/1983 ద్వారా ఆయన తండ్రికి సంక్రమించియున్నది నా యొక్క క్లయింటు తన పనుల నిమిత్తం తేది:17-12-2023న సుమారు ఉదయం 12 గంటల సమయంలో నల్లగొండకు వెళ్ళినారు. అక్కడ నాగార్జున కాలనీ ఏరియాలో ఆటోలో ప్రయాణించు సమయంలో పైన ఉదహరించిన ఆస్తికి సంబంధించిన (ఒరిజినల్) విక్రయ దస్తావేజు నెం.2064/1983ను పోగొట్టుకొనియున్నారు. అట్టి దస్తావేజును నా యొక్క క్లయింటు అయిన కందుల రాంబాబు గారు ఏదేని బ్యాంకులకుగాని, ఆర్థిక సంస్థలకుగాని, వ్యక్తులకు గాని, ఏ విధమైన తాకట్టు గాని, కుదవ పెట్టుట గాని చేసియుండలేదు.
ఇట్టి దస్తావేజు ద్వారా ఎవరికైనా ఏ విధమైన హక్కులు సంక్రమించియున్న పక్షంలో ఈ క్రింద తెలిపిన చిరునామాకు సంబంధిత ఆధార ప్రతులతో వారి యొక్క హక్కులు ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి (7) రోజులలో తెలుపుకొనగలరు. దారిమాల వచ్చిన ఆక్షేపణలు నా యొక్క క్లయింటును ఏ విధంగా కూడా బాధ్యులను చేయజాలవు. అభ్యంతరములు తెలియజేయవలసిన చిరునామా.

సం/- షేక్ కరీముల్లా, అడ్వకేట్
సాయి అపార్ట్‌మెంట్ ఎదురుగా, భవానినగర్
కోదాడ టౌన్, సూర్యాపేట జిల్లా,
సెల్:9705178603